# అమ్మా...!

లోకంత లోగిలి బిక్కు బిక్కు మంటోంది. మనుష్యులు లేక కాదు. ఇంటి నిండా గుంపులు-గుంపులుగా అమ్మ తరఫువాళ్ళు-నాన్న తాలూకువాళ్ళు, స్నేహితులు-తెలిసినవాళ్ళు-తెలియని వాళ్ళు...ఎవరెవరో...దిగులుగా మౌనంగా తిరుగుతున్నారు. ఆ సందడిలో జీవం లేదు. చిన్నపాప ఒక మూల బిక్క ముఖంతో నిశ్చేష్టంగా నిలబడి వుంది. కీచుగా, గుండెలవిసేలా వినవస్తున్న రోదనలు పాపకు భయం కలిగిస్తున్నాయి. ఒక మూల నాన్న తల వాల్చి నిర్వికారంగా చూస్తున్నాడు. ఎవరెవరో వచ్చి భుజం తట్టి ఓదారుస్తున్నారు. నాన్నని తనెప్పుడూ అలా చూడలేదు.

పాప జాలి జాలువారుతున్న దిగులు చూపులతో చూస్తోంది. కదలక, మెదలక పడివున్న అమ్మకు స్నానం చేయించారు మంత్రాలు చదువుతూ. ఎర్రటి కొత్త చీర కట్టారు. నంటి నిండా కుప్పలుగా పసుపు, కుంకుమ, పూలు చల్లారు. అంతా అమ్మను ఎత్తుకుని తీసుకుపోతున్నారు. ఏడుపులు హృదయవిదారకంగా మిన్నంటుతున్నాయి. భయంకరంగా మేళం మోగుతోంది. ఎవరో ఘొల్లుమంటూ పాపను దగ్గరకు లాక్కున్నారు. ఆ స్పర్శలో అమ్మను పోల్చుకోవాలని పరితపిస్తోంది పాప హృదయం. అమ్మ పిలుపుకోసం ఆవేగ పడుతోందా పసి మనసు. వెళ్ళిపోయిన అమ్మ తిరిగి రాలేదు. నాన్న ఒక్కడే వచ్చాడు. పాప మనసులో తెలియని భయం- దుఃఖం స్థిరపడ్డాయి. అమ్మ ధ్యాసే మనసు నిండా...

కొద్ది రోజులు ఎలాగో గడిచాయి. అమ్మ జ్ఞాపకాలు నుండి తప్పించుకోవాలని చూస్తున్నారు నాన్న, నాయనమ్మ...అందరూ. ఎవరూ అమ్మ మాటే తల పెట్టడం లేదు. పాపకు ఏడుపొస్తోంది. కోపమొస్తోంది. ఎందుకో ఈ అన్యాయాన్ని ఆ లేత మనసు సహించలేకపోతోంది. అమ్మను మరచిపోవడం సాధ్యమా...? సాధ్యమే అనిపిస్తోంది పెళ్ళకి! పాపకు ఏదో అర్థమవుతోంది. ఇంట్లో కొత్త సందడి మొదలైంది. కలత పడిన పాప హృదయం అమ్మను తలచి, తలచి మరింత కృంగిపోయింది. తన చిన్న పెట్టెలో దాచుకున్న అమ్మ చీర గుండెలకదుముకుంది ఆర్తితో- అమ్మ స్పర్శలాగే మృదువుగా...హాయిగా వుందా జ్ఞాపకం. అచ్చం అమ్మలాగే అనురాగంతో-ఆప్యాయంగా దగ్గరగా హదువుకుంటోంది. పాప గుండెల్లోంచి నవ్వుతోంది అమ్మ ప్రేమగా-దయగా. 'ఇంతే తల్లీ...ఈ లోకం...' అని బుజ్జగిస్తోంది. 'అమ్మా... అమ్మా...!' అనుకుంది ఆర్ద్రంగా పాప...అమ్మ... అమ్మ... ఎక్కడో లేదు. తనలోనే వుంది. తన గుండెలోనే వుంది. తన ఊపిరిలోనే వుంది అమ్మ.

—యర్రమిల్లి విజయలక్ష్మి



"రండి మేడమ్ రండి" రిక్షా దిగి పాఠశాలలో అడుగు పెట్టిన మనోహరీ దేవిని చుట్టుముట్టారు ఉపాధ్యాయిను లంతా.

అంతవరకు తన కింద పనిచేసిన వారంతా ఈ రోజు తన చుట్టూ చేరి అలా స్వాగతం పలుకుతూ వుంటే ఆమె మనస్సు సంతోషంతో ఊగిసలాడింది.

"ఎందుకమ్మా, ఇంత హడావిడి. రోజూ మీతో పనిచేసిన మనిషినేగా" అంది మనసును దాచుకుంటూ.

"ఇంక రేపటి నుంచి మీరు మాతో వుండరు కదా మేడమ్" వారి కంఠాలు బరువెక్కాయి. వారి మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. వారి ముఖాల్లో తెలియని బాధ తొంగి చూసింది.

"మేడమ్ వచ్చేసారా! రండి! రండి! మీ కోసమే చూస్తున్నాం" అప్పుడే అక్కడకు వచ్చిన శశిరేఖమ్మ తన గదిలోకి తీసుకు వెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టింది. మిగిలిన వారంతా ఆమె వెనకే వచ్చారు.

అంతకు ముందు రోజే పది సంవత్సరాలు ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి మనోహరీదేవి రిటైరు అయింది. అంత వరకు అసిస్టెంటుగా పనిచేసిన శశిరేఖమ్మ ఆ స్థానంలోకి వచ్చింది.

ఇన్నాళ్ళు తను కూర్చున్న కుర్చీలో కూర్చున్న శశిరేఖమ్మను వింతగా చూసింది మనోహరీదేవి. ఆ కుర్చీలో కూర్చోగానే శశిరేఖమ్మలో ఏదో వింత హుందాతనం కనబడుతోంది. మరి తనలో ఆ హుందాతనం పోయిందా? అనుకోకుండా తనవైపు తానే చూసుకుంది. ఏదో తెలియని లోటు మనస్సులో మెదిలి మనస్సు చివుక్కుమంది.

ఆ రోజు మనోహరీదేవికి వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. ఆ పాఠశాలలోనే ఉపాధ్యాయినిగా చేరిన మనోహరీదేవి సుమారు ఇరవై సంవత్సరాలు పనిచేసి ప్రధానోపాధ్యాయిని అయింది. ఆ పాఠశాలకు- ఆమెకు ముప్పై సంవత్సరాల అనుబంధం. ఆ పాఠశాలలోని ప్రతిగది, ప్రతిగోడ, ప్రతి బల్ల, ప్రతి వస్తువు ఆమెకు సుపరిచితమే. ఆ ఆవరణలోని ప్రతి చెట్టు ప్రతి మొక్క ఆమె చేతిలో పెరిగినవే.

అక్కడక్కడ తెల్లబడిన ఆమె జుట్టు ఆమె జీవితానుభవాలకు చిహ్నంగా కనబడుతోంది. కాస్త ముడుతలు పడిన నుదురు, జారిన చెక్కిళ్ళు ఆమె వయసుకు వింత శోభ కలిగిస్తున్నాయి. లేత రంగు సాదా నేత చీరలో కూర్చున్న ఆమె ఆ కుర్చీకే నిండుగా కనబడుతోంది. ఆమె మనసు మెత్తనిది అయినా మాటలో గాంభీర్యముంది. ఆ మాటే పది మందిని ఆకట్టుకుంటోంది. అందుకే ఆమె సర్వీసంతా ఏ ఒడుదుడుకులు లేకుండా సాగిపోయింది.

అంతటి సాన్నిహిత్యమున్న ఆ ప్రాంతాన్ని వదిలి రేపటి నుంచి ఎలా వుండగలను? అనుకున్న ఆమె మనస్సు చివుక్కు మంది. కళ్ళు తడి అయ్యాయి.


"అంతా రెడీ చేసాము మేడమ్. మీరింక రావాలి" పదవ తరగతి చదువుతున్న విద్యార్థినుల గుంపు వచ్చి హడావిడి చేసింది.

"ఎందుకమ్మా ఈ హడావిడి. నేను వద్దని చెప్పాను కదమ్మా!" అంటున్న ఆవిడ మాటలు వినిపించుకోకుండానే-

"మీరలా అంటే ఎలా మేడమ్! మీతో సంతోషం పంచుకోవాలనే కదండీ ఇవన్నీ ఏర్పాటు చేసాము. మాకా అవకాశం వద్దంటారా మేడమ్?" వాళ్ళ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వారి ఆప్యాయతకు కరిగిపోయింది ఆమె మనసు.

"మేడమ్ వస్తున్నారు కదా! మీరింక పదనండమ్మా!" పనులన్నీ ముగించుకుని సీట్లోంచి లేచింది శశిరేఖమ్మ.

అంతలో గంట మోగింది. మిగిలిన ఉపాధ్యాయిను లంతా తరగతులు వదిలి రిజిస్టర్లు సర్దుకుని మనోహరీ దేవివైపు వచ్చారు.




విద్యార్థినులంతా పుస్తకాల సంచీలు మోసుకుంటూ తరగతులు వదలి సభా ప్రాంగణంవైపు కదిలారు.

అందరు బలవంతం చెయ్యగా మనోహరీదేవి కుర్చీ లోంచి లేచింది. ఆమె పక్కగా శశిరేఖమ్మ నడుస్తోంది. వారికి ముందుగా విద్యార్థినీ ప్రతినిధులు నడుస్తున్నారు. ఉపాధ్యాయినులు వారికి వెనుకగా నడుస్తున్నారు. కొందరు ముందుగానే వెళ్ళి వేదిక ఏర్పాట్లు చూస్తున్నారు.

పట్టుచీరెలతో, రకరకాల జుట్టు ముడులతో చేతి సంచీలతో గంభీరంగా అడుగులు వేస్తున్నారు ఉపాధ్యాయినులంతా. మధ్యలో కొత్త ప్రధానోపాధ్యాయిని శశిరేఖమ్మా, రిటైరయిన మనోహరీదేవి ఉభయ సంధ్యల్లా వున్నారు. అక్కడ గాజుల గలగలలు లేవు. అందెల మోతలు లేవు. పరాచికాల పూల జల్లులు లేవు. వివేకాన్ని వెదజల్లే చిరునవ్వులు కనబడుతున్నాయి. విజ్ఞానం వెదజల్లే చూపులు పరుచుకుంటున్నాయి ఆ ప్రాంతమంతా.

అందరి మనస్సుల్లోను తీయని అనుభవాల అలజడి. అందరూ కలిసి జరుపుకునే పండుగ వైభవమక్కడ తాండవిస్తోంది.

"స్వాగతం, సుస్వాగతం" అంటూ విద్యార్థినులు పాడుతూ రెండు వైపులా బారులు తీరి నిలబడి పూల రేకులు దోసిళ్ళతో వారిద్దరిమీద జల్లుతున్నారు. పూల పరిమళం అంతటా వ్యాపించింది. టేపు రికార్డులోని సన్నాయి పాట మనోహరంగా వినబడుతోంది.

వేదిక మామిడి తోరణాలతో పచ్చని చేమంతి మాలలతో కలకలలాడుతోంది. వీడ్కోలు సభ అంత వైభవంగా ఏర్పాటు చేస్తారని మనోహరీదేవి ఊహించలేకపోయింది. తన హయాంలో ఎవరికీ అంత ఘనంగా ఏర్పాటు చేసినట్టు గుర్తులేదు. వారి అభిమానానికి మనస్సులోనే కృతజ్ఞతలు అర్పించింది.

అందరూ కలిసి పూల మాలలు వేసి వేదిక మీదికి తీసుకు వెడుతుంటే పెళ్ళి కూతురులా తల వంచుకుంది ఆమె. అందరూ వేసిన పూల దండలతో ఆమె మెడ నిండింది. వారు చూపే అభిమానంతో ఆమె మనసు నిండింది.

ముందుగా విద్యార్థినుల తరపున కార్యదర్శి వచ్చి మనోహరీదేవి గుణగణాలు, ఆమె ఆ పాఠశాలకు చేసిన సేవ అభివర్ణించింది. సభలో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. పది నిమిషాలు చప్పట్లు మోగుతూనే వున్నాయి.

తరువాత శశిరేఖమ్మ లేచి నిలబడింది. "మనోహరీదేవి వలననే ఆ పాఠశాల అంత అభివృద్ధి చెందినదని, ఆమె రిటైరై వెళ్ళిపోడం ఆ పాఠశాలకే తీరని లోటని, తమకు పెద్ద దిక్కు లేకుండా అయిందని' చెప్పింది.

చివరి మాట అంటుంటే ఆమె గొంతు పూడుకుపోయింది. కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఎవరి కంట పడకూడదని తల వాల్చేసుకుంది.

మనోహరీదేవి గుండె బాధతో మూల్గింది. వారి అభిమానాన్ని గుండెలో ఇముడ్చుకోలేక విలవిల్లాడింది.

అంతవరకు నవ్వుతున్న విద్యార్థినుల ముఖ పద్మాలు ముడుచుకుపోయాయి. వారి మధ్యలో నుంచి ఎక్కిళ్ళు వినబడ్డాయి. ముక్కు చీదుళ్ళు, ఎగ ఊపిర్లు చిందరవందర చేసాయి.

తరువాత ఆఫీసువారు, ఉపాధ్యాయినులు మాట్లాడుతూ ఏడుపు ఆపుకోలేక చెప్పడం మధ్యలోనే ఆపి అందరూతిరిగి తమ స్థానాలకు వెళ్ళిపోవడం జరిగింది.

తరువాత మనోహరీదేవిని మాట్లాడమని కోరారు.

కళ్ళు తుడుచుకుని వచ్చి మైకు దగ్గర నిలబడి నోరు తెరచింది- "మిమ్మల్ని వదిలి వెళ్ళడం నాకు బాధగానే..." ఇంక ఆమెకు మాటలు రాలేదు. ఏదో బాధ ఆమె కడుపులో పొంగి గొంతు వరకు వచ్చినట్లయింది. గొంతు పూడుకు పోయింది. ఆ దుఃఖం కళ్ళలోకి వచ్చి ఆగలేక ధారాపాతంగా కారడం మొదలు పెట్టింది. చేతులెత్తి అందరికీ నమస్కరించి తిరిగి వచ్చి తన కుర్చీలో కూర్చుంది. ఆ సమయంలో ప్రపంచమంతా

శూన్యంగా, తాను ఆ శూన్యంలో కూరుకుపోతున్నట్టుగా కనబడింది ఆమెకు.

ఆ సభలో సన్నాయి రాగానికి బదులుగా ఏడుపొక్క రాగం వినబడింది.

ముందుగా తేరుకున్న శశిరేఖమ్మ జరగవలసింది ఆదేశించింది. వెంటనే ఉపాధ్యాయినుల కార్యదర్శి లేచి కళ్ళు తుడుచుకుని మైకు దగ్గరకు వెళ్ళి వందన సమర్పణ చేసింది. సభ ముగిసింది.

పెద్దలంతా కుర్చీల్లోంచి లేచారు. కింద కూర్చున్న పిల్లలంతా వేదిక ఎక్కి మనోహరీదేవిని చుట్టుముట్టారు. అంతవరకు క్రమశిక్షణ పాటించిన విద్యార్థినులు అలజడి చేశారు.

"టీచర్! ఎప్పుడొస్తారు మళ్ళీ" అని కొందరు.

"టీచర్! మళ్ళీ వచ్చినప్పుడు మా క్లాసుకొస్తారా?" అని మరికొందరు.

"మేడమ్ మీరు వెళ్ళిపోవద్దు మేడమ్" అని ఇంకొందరు.

"మా పుస్తకంలో సంతకం పెట్టండి మేడమ్" అని మరికొందరు.

ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ ముందుకు వెళ్ళి పోతున్నారు.

కొందరికి సమాధానాలు చెప్పిందామె. మరికొందరి పుస్తకాల్లో సంతకాలు పెట్టింది ఆమె. అయినా అలజడి తగ్గలేదు.

ఉపాధ్యాయినులు, అటెండర్లు, వాచ్‌మాన్ అందరు కలిసి వారిని బయటికి పంపడానికి చాలా కష్టపడ్డారు. యువశక్తి విజృంభిస్తే అదుపులో పెట్టడం కష్టమే మరి.

రోజూ మనోహరీదేవి ఎక్కే రిక్షా రోజూలాగే వచ్చి గేటులో ఆగింది. అందరూ కలిసి నడుచుకుంటూ రిక్షా వరకు వచ్చారు.

ఆమెకు వేసిన పూల దండలు, మెమెంటో పట్టుకొచ్చి రిక్షాలో పెట్టారు. రిక్షా అతను వాటివైపు ఆశ్చర్యంగా చూశాడు.

"జ్ఞాపకం పెట్టుకోండి మేడమ్"

"అప్పుడప్పుడు వస్తూ వుండండి మేడమ్."

"నాలుగు రోజులకోసారి వచ్చి వెళ్ళాలండి మేడమ్!"

అలా రకరకాలుగా ఆమెను వేడుకున్నారు అక్కడ నిలబడినవారంతా.

"అలాగే వస్తా. ఇంక వెడతా" కంఠం వణుకుతూ వుంటే మనోహరీదేవి అందరికీ నమస్కారాలు పెట్టి వెళ్ళి రిక్షాలో కూర్చుంది.

అందరి కళ్ళలోనూ కన్నీరు సుళ్ళు తిరుగుతోంది. అందరి హృదయాలూ నీటితో నిండిన మేఘాల్లా బరువెక్కాయి. రిక్షా ముందుకు కదిలింది.

నోటితో ఏమీ చెప్పలేక అందరూ చేతులు ఊపారు. ప్రతి సమాధానంగా ఆమె కూడా చేయి ఊపింది. అందరూ కళ్ళు తుడుచుకున్నారు. రిక్షా కనుచూపు మేర దాటింది.

రోజూ ఉదయం హడావుడిగా వంట పని ముగించుకుని భర్తకు అన్నం పెట్టి తాను తిని పాఠశాలకు బయలుదేరేది ఆమె. వెళ్ళింది మొదలు అక్కడ చేతి నిండా పనే. ఎన్నో సమస్యలు, చర్చలు! ఆ కుర్చీలో కూర్చుని ఎంతమందితో మాట్లాడిందో!! ఎన్ని సమస్యలు పరిష్కరించిందో! ఆ పాఠశాలను ఎంత అభివృద్ధి చేసిందో!! అంత కష్టపడి పెంచిన ఆ పాఠశాలను వదిలి వెళ్ళిపోతుంటే ఆమె మనస్సు రెక్కలు తెగిన పక్షిలా విలవిల్లాడింది.

రేపటి నుంచి తన చుట్టూ అంతమంది చేరరు. రేపటినుంచి తన సలహాలు ఎవరూ అడగరు. తనకు ఏ బాధ్యతా లేదు. పదవి పోయిన మాజీ మంత్రిలాంటిది తను. ఆమె మనస్సు బాధతో మూల్గింది. కడుపులో ఎవరో చెయ్యి పెట్టి కెలికినట్లయింది. అయినా కాలం ఆగలేదు. రిక్షా పోతూనే వుంది. రిక్షా వచ్చి గుమ్మంలో ఆగింది. రిక్షా అతను పూలదండలు, మెమెంటో తీసి వీథి వరండాలో టీపాయ్ మీద పెట్టాడు.

ఆమె రిక్షా దిగి మెట్లు ఎక్కింది.

"అమ్మగారూ రేపూ..." అడగలేక ఆగిపోయాడు.

"రేపటినుంచి నువ్వు రానవసరం లేదు. నేను రిటైర్ అయ్యాను" అంది బరువెక్కిన కంఠంతో.

ఇందాక వాచ్‌మన్ రిటైర్ అయ్యారని చెప్పాడు. కాని స్కూలుకు వెడతారో వెళ్ళరో మాత్రం చెప్పలేదు. రిటైర్ అవడం అంటే అతనికి అర్థమయింది.

"సరేనమ్మా!" అంటూ మెట్లు దిగాడు.

"రేపొచ్చి డబ్బు తీసుకో. ఎప్పుడైనా వచ్చి కన బడుతూ వుండు"- ఆవిడ మాటలు పూర్తిగా వినిపించుకోకుండానే అతను రిక్షా తొక్కుకుంటూ వెళ్ళి పోయాడు.

'రిటైరయితే అందరికీ లోకువేనేమో' ఆమె మనస్సుకు మరోసారి గాయమయింది. దుఃఖం పొంగి వచ్చింది. అదుపులో పెట్టుకోవడానికి ఉక్కిరి బిక్కిరి అయింది.

"నానమ్మ వచ్చింది, నానమ్మ వచ్చింది" అంటూ మనవడు, మనవరాలు ఆమెను చుట్టుకున్నారు.

ఆ చిన్నారుల ప్రేమకు బరువెక్కిన గుండెల్లో బాధ ఎవరో తీసి బయటపడేసినట్టయింది. తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

ఉలుకు పలుకు లేని నానమ్మను మరోసారి కుదిపారు వాళ్ళు.

"బడినుంచి ఎప్పుడొచ్చార్రా" అంటూ ఇద్దరినీ రెండు చేతులతో పట్టుకుని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది. గుండె మూలల్లోని మమకారం పొంగి వచ్చింది. అంతవరకు శూన్యంలో కూరుకుపోయిన ఆమె సంతోష జలధిలోకి కొట్టుకు వచ్చినట్లయింది.

"తాతగారేర్రా" ఆమె మాటల్లో కొత్త ఉత్సాహం.

"పడుకున్నారు నానమ్మా" ఇద్దరూ ఒకేసారి సమాధానమిచ్చారు.

ఆమెను చూసి వారికి మరింత ఉత్సాహం వచ్చింది.

"నానమ్మా! నానమ్మా! నాకు ఆకలి వేస్తోంది" ఇద్దరూ ఒకేసారి చెప్పారు.

"పాలు తాగలేదా!" ఆప్యాయంగా అడిగింది. ఆ ఆప్యాయతకు ఇద్దరు పిల్లలు కరిగి ఏడ్చారు.

"లేదు నానమ్మా! మరి పాలు పిల్లి పారబోసింది" అన్నాడు పిల్లాడు కళ్ళు నులుముకుంటూ.

"మరి బిస్కత్తు ఆయా తినేసింది" అంది మనవరాలు కళ్ళు తుడుచుకుంటూ.

మనోహరీదేవి మనస్సు విలవిల్లాడింది. ఇంక వారి మాటలు వినలేకపోయింది.

పిల్లలిద్దరు బడినుంచి పన్నెండు గంటలకే వచ్చేస్తారు. ఆయా చూస్తుంది వాళ్ళని. కోడలు ఆఫీసులో పని చేస్తుంది. ఉదయం తొమ్మిది గంటలకు ఇంటినుంచి బయలుదేరితే సాయంకాలం ఏడు గంటలకు ఇల్లు చేరుకోగలుగుతుంది.

తను పాఠశాలలో పిల్లల్ని అంత జాగ్రత్తగా చూస్తుంటే ఇంట్లో తన మనవలు నానా ఇబ్బంది పడుతున్నారు. వంటింట్లోకి వెళ్ళి ఇద్దరికి పాలు కాచి పట్టుకొచ్చి ఇచ్చింది. బిస్కట్లు పెట్టింది. వారు ఆవురావురని తింటుంటే ఇద్దరిని ఒళ్ళోకి తీసుకుని ఆప్యాయంగా ఒళ్ళు నిమిరింది.

"రేపటినుంచి నేను ఇంట్లోనే వుంటాన్రా. పాలు నేనే ఇస్తా. అన్నం నేనే పెడతా" అంది నవ్వుతూ.

"మా నానమ్మ ఎంత మంచిదో" అంటూ పిల్లలిద్దరూ ఆమెను ముద్దు పెట్టుకున్నారు.



## కాంపెన్ సేట్

విక్కీ, శ్రీకాంత్ ఇద్దరూ ఎల్.కె.జీ., యు.కే.జీ. పిల్లలు.

వాళ్ళ అమ్మను స్నేహితురాలు అడిగింది-

"మీ పిల్లలు రోజూ స్కూలులో టైలు, బెల్టులు, పెన్సిళ్ళు పారేయిరా?" అని.

"అబ్బె! అదేం లేదండి. ఒకరు పారేస్తారు, మరొకరు ఎవరివో ఒకరివి రోజూ అదనంగా తెస్తూ వుంటారు."

—ఇ.వి.రమణ

## యువతరం

మన సంస్కృతి
మన సాంప్రదాయం
సమతా-మమతా వీథుల్లో
ముస్తాబైన పూలరథాలు!
వాటిని లాగవలసిన
యువతరం మాత్రం
పాశ్చాత్య నాగరికతా
పల్లకిని మోస్తున్న బోయలు!!

—జ్వాలా గోపీనాథ్

# నిర్మల వక్కపొడి

ఆగస్టు 15వ తేదీనుంచి మా నిర్మల 0-10 పైసల వక్కపొడి 3 డజన్లు గాని, 0-25 పైసలవక్కపొడి 3డజన్లు గాని, డీలక్స్ గోల్డ్ కవర్ ప్యాక్ 1 Kg. గానీ కొన్నవారు ఒక పెద్ద స్టైయిన్‌లెస్ స్టీల్ గ్లాసు (బాంబే మోడల్) అడిగి తీసుకొనవలయును.

నిర్మల వక్కపొడి
మ్యానుఫాక్చరింగ్
కంపెనీ

ట్రంక్ రోడ్,

నెల్లూరు - 524 001

ఫోన్స్: ఆఫీసు-3795, ఇల్లు- 3796, షాప్- 4796

PRIYADS


"మనూ ఎప్పుడొచ్చావ్" అంటూ మంచం దిగి పరుగున వచ్చారు సూర్యారావుగారు. ఆయన ముఖంలో కొత్త సంతోషం కొట్టవచ్చినట్లు కనిపించింది.

"ఎప్పుడో వచ్చేశా" అంది ఆవిడ మరింత సంతోషంగా.

ఆ సమయంలో ఆమె పదేళ్ళ చిన్నదానిలా కన బడింది ఆయన కంటికి. భార్యను ఆప్యాయంగా చూసుకున్నారు.

ఆయన దృష్టి వరండాలోని టీపాయ్ మీద పడింది.

"ఏమిటీ? ఈ దండలన్నీ నీకే వేశారా?" అంటూ కదిలి ఆ దండలు చేతిలోకి తీసుకున్నారు.

"ఏదీ మరోసారి వేసి ఎలా వుంటావో చూడనీ" అంటూ బలవంతంగా ఆమె మెడలో వేశారు.

మనవలు చప్పట్లు కొట్టారు. ఆమె తల వంగి పోయింది.

పెళ్ళినాటి మనోహరీదేవి ఆయన కళ్ళముందు నిలిచింది.

"ఎంత బాగున్నావో మనోహరీ" అన్నారు ఆప్యాయంగా.

నవ్వుకుంటూ తిరిగి ఆ దండలు తీసి టీపాయ్ మీద పెట్టేసింది ఆమె.

"ఇదేమిటి ఈ వెండిబొమ్మ. ఎంత బాగుందో. ఇదీ వాళ్ళే ఇచ్చారా? కృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేస్తున్నాడు. మనిద్దరిలో ఇప్పుడు కృష్ణుడెవరో, అర్జును డెవరో తేల్చుకోవాలోయ్" అన్నారు నవ్వుతూ.

సిగ్గుతో మెలికలు తిరిగింది ఆమె.

"అలాగే తేల్చుకుందాం లెండి. ముందు కాఫీ తాగండి" అంటూ వంటింటివైపు కదిలి కాఫీ గ్లాసుతో తిరిగి వచ్చింది.

ఆయన గ్లాసు అందుకుని కుర్చీలో కూర్చుంటూ చెయ్యి పట్టుకుని "కూర్చోవోయ్" అంటూ మరో కుర్చీలో కూర్చోబెట్టాడు.

"నువ్వు తెచ్చుకోలేదేం కాఫీ" అంటూ లేచి వెళ్ళి మరో గ్లాసు ఆమెకు అందించాడు. కళ్ళు మిలమిల మెరుస్తుంటే గ్లాసు అందుకుంది.

పిల్లలిద్దరు పూల దండలతో ఆడుకుంటున్నారు.

"మనోహరీ! ఫంక్షన్ బాగా అయిందా!" ప్రేమగా అడిగారాయన.

"ఆ! బాగా జరిగింది. ఎంత బాగా ఏర్పాట్లు చేశారో" అంది ఉత్సాహంగా.

"ఇలా కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగి ఎన్నాళ్ళయిందో మనూ. ఈవేళ పెళ్ళయిన కొత్త రోజులు అంటే నువ్వు ఉద్యోగంలో చేరని ముందు రోజులు గుర్తుకొస్తున్నాయోయ్" అన్నారు నవ్వుతూ.

"అందుకే రిటైర్‌మెంట్ పెట్టినట్టున్నారండి" అంటూ ఆప్యాయంగా చూసింది అతనివైపు.

నిన్నటివరకు జబ్బుపడినట్టుగా నీరసంగా కూర్చునే ఆయనలో కొత్త ఉత్సాహం చూసి ఆమె ఆశ్చర్య పోయింది.

"ఒంట్లో ఎలా వుంది" నవ్వుతూ అడిగింది. ఆయన ఒళ్ళు జలదరించింది.

"రెండేళ్ళనుంచి ఒంటరిగా ఇంట్లో వున్న నాకు తిరిగి నీ తోడు దొరికిందోయ్. ఇంక నాకు అనారోగ్యం ఎక్కడిది?" అన్న అతని మాటల్లోని యథార్థం గ్రహించిన మనోహరీదేవి భర్తవైపు ఆప్యాయంగా చూసింది.

పాఠశాలలో తను లేకపోయినా శశిరేఖమ్మ ఎంతో బాగా నడిపిస్తోంది, తను లేకుండానే! ఎంత పెద్ద సభ ఏర్పాటుచేశారు! తను లేకపోయినా ఉపాధ్యాయినులు ఎంతో బాగా పాఠాలు చెబుతున్నారు. తను లేని లోటు అక్కడ లేదు. కాని ఇక్కడ తను లేని లోటు తీర్చేవారు లేరు. నిజంగా ఇప్పుడు తన అవసరం ఇంట్లోనే–అటు మనవలకి, ఇటు భర్తకి.

"ఏమిటి మనూ అలా చూస్తున్నావు! ఇక మనం కలిసే కాఫీ తాగుతాం. కలిసే తింటాం. కలిసే ఇంటి పని చేసుకుంటాం" పకపకా నవ్వుతున్న భర్తతో శ్రుతి కలిపింది మనోహరీదేవి.

వెయ్యి సంక్రాంతులు ఆమె కళ్ళముందు నిలిచినట్లయింది. ఆ ఇద్దరిలోనూ మమకారం మరో మెట్టు ఎక్కినట్లనిపించింది. ■

## క్రికెట్ వర్సెస్ ఎగ్జామ్స్

"మార్కుల లిస్టులు వచ్చాయట కదా! ఎన్ని సబ్జెక్టులలో ఫెయిలయ్యావు" అడిగాడు తండ్రి, కొడుకుని.

"నాలుగింట్లో క్లీన్ బౌల్డ్, ఒక దాంట్లో ఎల్.బి. డబ్ల్యు" చెప్పాడు క్రికెట్ అభిమాని అయిన కొడుకు.

"అంటే?"

"నాలుగింట్లో జీరోలు, ఒకదాంట్లో ముప్పై నాలుగు" వివరించాడు పుత్రరత్నం.

— 'నీల'

## వ్యసనాలు వదిలి లక్షాధికారి అయ్యాడు

లక్షాధికారి కావాలంటే ఏ లాటరీ మీదనో ఆధార పడాల్సిన అవసరం లేదు. పొదుపుచేసి కూడా లక్షాధికారి కావచ్చు. గుజరాత్‌లోని బల్సాడ్ జిల్లాలోని వాపీ పట్టణానికి చెందిన ఒక చిన్న వ్యాపారి 1947 నుంచి మద్యం, బీడీలు, సట్టా మొదలైన అన్ని వ్యసనాలను వదిలిపెట్టి, వాటి మీద చెయ్యించే ఖర్చును పొదుపుచేసి ఆ డబ్బంతా ఓ ఖాళీ డబ్బాలో వేయసాగాడు. ఇటీవల అతను వాటిని లెక్క పెడితే రెండు లక్షలకు పైగా వున్నాయి.

ఈ వార్తను పూర్తి వివరాలతో గుజరాత్ సమాచార్ ప్రచురించింది.

—రఘు